సాక్షి
చిత్తూరు
శనివారం । 12 । అక్టోబర్ । 2024



సీఎంసీకి మరో వరం

చిత్తూరు సీఎంసీ మరో అడుగు ముందుకేసింది. మెడికల్ కాలేజీ, టీచింగ్ ఆస్పత్రి ఏర్పాటుకు కసరత్తు మొదలు పెట్టింది. - 6లో



దళితులపై టీడీపీ నేతల దాడి

వి.కోట మండలం మిట్టూరులో దళితులపై అగ్రవర్ణాలు దాడి చేసి, వారిపైనే కేసులు పెట్టించారు. - 6లో



చంద్రబాబే చెప్పింటే..

ఇసుక తోలుకోమని చంద్రబాబే చెప్పింటే అడ్డుకోవడానికి తహసీల్దార్ ఎవరు అంటూ పలమనేరులో స్మగ్లర్లు రెచ్చిపోయారు. - 6లో

న్యూస్‌రీల్

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో జిల్లా సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని అభిలషించారు. ప్రతి ఇల్లు సిరిసంపదలతో తులతూగాలని అమ్మవారిని ప్రార్థించారు.

పండుగను ఆనందంగా జరుపుకోవాలి



ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: జిల్లా వాసులు విజయదశమి పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతమే విజయదశమి అన్నారు. పండుగను ప్రతి ఇంటిల్లి పాది సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు.

14 నుంచి హెచ్‌ఎంలకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎంలకు ఈ నెల 14వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖకు ఉత్తర్వులు పంపారు. ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో 6 రోజుల పాటు ఈ రెసిడెన్షియల్ శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎంలకు లీడర్‌షిప్ క్వాలిటీ అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు నియమించిన జిల్లాలోని హెచ్‌ఎంలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఎవరైనా గైర్హాజరైతే చర్యలు తప్పవని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

13 మంది అధికారుల కేటాయింపు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయానికి 13 మంది అధికారులను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేటర్, సర్కిల్ కార్యాలయాల్లో ఉన్న అధికారులను సర్దుబాటు చేయగా కొన్ని పోస్టులను కుదించారు. ఎంఅండ్‌పీ విభాగాన్ని ఎంఆర్‌టీగా మార్పు చేసి ఇదివరకే ఉన్న ఈఈ వాసుదేవరెడ్డిని కొనసాగించారు. నిర్మాణ విభాగానికి అమర్‌బాబు, టెక్నికల్ విభాగానికి ఈఈగా జగదీశ్, డీపీఈ ఈఈగా షణ్ముగం, పీఓగా రెడ్డెప్ప, ఏఓగా ప్రసన్న ఆంజనేయులు, ఏఏఓగా శివకుమారి, నిర్మాణవిభాగం డీఈ–1గా మాధవరావు, డీఈ–2గా జ్ఞానేశ్వర్, హెచ్‌టీఎం సీటీఎం విభాగం డీఈ–1గా కమలాకర్‌రావు, డీఈ–2గా సిరాజుద్దీన్, ట్రాన్స్‌ఫార్మర్ అండ్ ప్రొటెక్షన్ డీఈగా ప్రభాకర్, ఎల్‌టీఎం, ఎస్‌పీఎం డీఈగా రవిని నియమించారు.

అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిత్యావసర సరుకులు అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ధరల స్థిరీకరణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వ్యాపారులు నిర్దేశించిన మొత్తం కంటే అధిక మొత్తంలో సరుకులను నిల్వ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వంట నూనెలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని, మార్కెట్ ధర కంటే తక్కువకు వినియోగదారులకు అందించేందుకు హోల్‌సేల్ వ్యాపారులు, ఆయిల్ మిల్లర్లు సహకరించాలని కోరారు.

తేరు.. భక్తజన హోరు



రథోత్సవానికి పోటెత్తిన భక్తులు





అశ్వవాహనంపై ఊరేగుతున్న మలయప్ప

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శుక్రవారం ఉదయం ఉభయదేవేరులతో కలిసి మలయప్పస్వామి రథంపై విహరిస్తూ కనువిందు చేశారు. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. రాత్రి కల్కి అవతారంలో కలియుగ వైకుంఠనాథుడు అశ్వవాహనంపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు.

- రథంపై విహరించిన మలయప్ప
- అశ్వ వాహనంపై కల్కి అవతారంలో దర్శనమిచ్చిన శ్రీనివాసుడు
- నేడు చక్రస్నానం, ధ్వజావరోహణం

తిరుమల: తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు శుక్రవారం ఉదయం ఉభయదేవేరులతో కలసి మలయప్ప స్వామి రథంపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. శ్రీనివాసుడి దివ్యమంగళ రూపాన్ని దర్శించి భక్తులు పునీతులయ్యారు. రథోత్సవం ప్రారంభమైన కొంత సేపటికి రథం ఆలయ సమీపంలోని కొలువు మండపం వద్దకు చేరింది. అక్కడి నుంచి ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది రథాన్ని జాగ్రత్తగా ముందుకు కదిలించారు. నాలుగు మాడవీధుల్లో రథం ముందుకు కదిలేటప్పుడు అష్టదిక్పాలకులకు పూజలు నిర్వహించారు.

అశ్వ వాహనంపై తేజోమయుడు

శుక్రవారం రాత్రి కల్కి అవతారంలో అశ్వ వాహనాన్ని అధిరోహించి మలయప్ప తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా డాక్టర్ రథసారథి

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన రథోత్సవంలో ఓ మహిళా డాక్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తిరుమలలో కొన్ని కార్యక్రమాల్లో మీరాశీ వ్యవస్థ ఉంది. ఈ క్రమంలో రథోత్సవంలో రథ సారథులుగా ఐదు కుటుంబాల ప్రతినిధులు పాల్గొంటారు. ఈసారి రెడ్డెప్పగారి, మునెప్పగారి వంశానికి అవకాశం వచ్చింది. ఈ ఇద్దరి వంశం నుంచి ఎవరూ మగ పిల్లలు లేరు. ఈ క్రమంలో వారి కుమార్తె, డాక్టర్ ఖ్యాతి (న్యూరోసర్జన్) తమ వంశ పరంపరను కొనసాగించారు.



రథసారథిగా డాక్టర్ ఖ్యాతి



కళార్చన



సాంస్కృతిక వైభవం





చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తి



చక్రస్నానం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీనివాసుడి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ వరాహస్వామివారి ఆలయం వద్దగల స్వామి పుష్కరిణిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి, శ్రీ చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం, ఆ తర్వాత చక్రస్నానం నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కరిణిలో గ్యాలరీలు, స్నానఘట్టాలు ఏర్పాటుచేశారు. టీటీడీ భద్రతా సిబ్బందితోపాటు ఎస్పీఎఫ్ సిబ్బంది, ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. తిరుమలలో శుక్రవారం జరిగిన సెక్టోరల్ అధికారుల సమావేశంలో ఈవో శ్యామలరావు మాట్లాడుతూ గరుడసేవ విజయవంతానికి అధికారులందరూ అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

కిక్కే.. కిక్కు

- చివరి రోజు మద్యంషాపుల కోసం వెల్లువెత్తిన దరఖాస్తులు
- వీటి ద్వారానే రూ.23 కోట్ల ఆదాయం
- 14న చిత్తూరులో లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు

ప్రాంతం	షాపుల సంఖ్య	దరఖాస్తుల సంఖ్య
చిత్తూరు అర్బన్	22	558
చిత్తూరు రూరల్	19	464
కార్వేటినగరం	8	282
నగరి	11	220
పుంగనూరు	14	158
పలమనేరు	13	170
కుప్పం	10	320
పులిచెర్ల	7	69
మొత్తం	104	2241

చిత్తూరు అర్బన్: జిల్లావ్యాప్తంగా మద్యం విక్రయ దుకాణాల కోసం చివరిరోజు దరఖాస్తులు భారీగా రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. గత ప్రభుత్వం మద్యం విక్రయాలను అదుపు చేయడానికి మద్యం దుకాణాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తే.. ఈ ప్రభుత్వం ప్రైవేటుకు దాసోహం అంటూ గేట్లు తెరిచేసింది. ఫలితంగా చిత్తూరు జిల్లాలో 104 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం గడువు ముగిసింది. దాదాపు 2,245 వరకు దరఖాస్తులు రావచ్చని అధికారులు భావిస్తున్నారు. కనీవిని ఎరుగని రీతిలో మద్యం దుకాణాల నిర్వహణ కోసం ఈస్థాయిలో వ్యాపారులు పోటీ పడడం ఇదే తొలిసారి కావడం విశేషం. దుకాణాల నిర్వహణ పెత్తనాన్ని ఎమ్మెల్యేలు నడిపిస్తున్నా.. కొన్నిచోట్ల ఆ మాటలు ఏవీ పట్టించుకోలేదు. ఎవరు ఇష్టం వచ్చినట్టు వాళ్ల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసున్నారు. అవసరమైతే ఇందుకోసం సిండికేట్లను కూడా కూటమి నేతలే ఏర్పాటు చేసుకున్నారు. రెండు రోజుల్లో తీయబోయే లాటరీలో అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచిచూడాలి.

భారీగా ఆదాయం..

దుకాణాల కోసం దరఖాస్తు చేసే వ్యాపారులు నాన్ రిఫండబుల్ రుసుము కింద రూ.2 లక్షలు చెల్లించాలని మద్యం పాలసీ నిబంధన. జిల్లాలో 2,245 వరకు దరఖాస్తులు రావచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ప్రభుత్వానికి వీటి ద్వారానే రూ.23 కోట్ల వరకు ఆదాయం లభించింది. లైసెన్స్‌ల జారీలో మరో రూ.62 కోట్లు, మద్యం విక్రయాల ద్వారా ఎంతలేదన్నా రూ.2 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి.

అత్యధికంగా ఎక్కడంటే..!

జిల్లాలోని పాలసముద్రం మండలంలో కేవలం ఒక్క దుకాణానికే అత్యధికంగా 82 దరఖాస్తులు వచ్చాయి. దీని తర్వాత యాదమరి దుకాణానికి 43, గుడుపల్లి దుకాణానికి 40, శాంతిపురానికి 38 వెదురుకుప్పం 37, విజయపురానికి 35 దరఖాస్తులు అందాయి.

14 నుంచి పల్లె పండుగ

– కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 14వ తేదీ నుంచి పల్లె పండుగను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన క్షేత్రస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో పల్లె పండుగ– పల్లె పంచాయతీ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాలని, పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజా సమాచార బోర్డులను తప్పక ఏర్పాటు చేయాలన్నారు. పనులకు సంబంధించిన ఫొటోలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పంచాయతీల్లో చేపట్టే పనులను గతంలో చేయలేదని ఏఈ, డీఈ, ఈఈ ఇలా పైస్థాయి వరకు సర్టిఫై చేయాల్సి ఉంటుందన్నారు. జాబితా, గ్రౌండింగ్ చేసిన పనులను కచ్చితంగా జియోట్యాగింగ్ చేయాలన్నారు.

29న ముసాయిదా ఓటర్ల జాబితా

జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను ఈ నెల 29వ తేదీ ప్రచురించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్‌ఓ పుల్లయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలకు సంబంధించి సెప్టెంబర్ నెలాఖరు వరకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల లొకేషన్లు, పేరు మార్పులపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించినట్లు డీఆర్‌ఓ వెల్లడించారు.

కత్తులతో టీడీపీ నేతల స్వైర విహారం



పెద్దిరెడ్డి బ్యానర్లు చింపివేస్తున్న టీడీపీ నేతలు

సాక్షి టాస్క్‌ఫోర్సు : చౌడేపల్లిలో టీడీపీ నేతలు కత్తులు పట్టుకుని గ్రామంలో స్వైర విహారం చేశారు. శుక్రవారం దాదేపల్లెకు చెందిన ఆ పార్టీ నేతలు ఎస్‌ఎండీ ఘని, ఫరీద్‌ఖాన్, నసీబ్‌ఖాన్, సయ్యద్‌ఖాన్, నదీం, నవాజ్‌ఖాన్, సిద్దిక్, జబీవుల్లా, సయ్యద్‌ఖాన్‌తో పాటు మరికొందరు కత్తులు పట్టుకుని గ్రామంలో వీరంగం సృష్టించారు. అంతటితో ఆగకుండా మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన బ్యానర్లను కోసేస్తూ.. బ్యానర్లు కట్టిన కట్టెలను నరికేస్తూ గ్రామంలో భయానక వాతావరణం సృష్టించారు. ఇదేంటని అడిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను నరికేస్తాం.. చంపేస్తాం.. అంటూ కత్తులు చూపుతూ బెదిరింపులకు దిగారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు సనావుల్లా, షేర్‌ఖాన్, చిన్నరెడ్డిబాషా, మహమ్మదాలి, ముజీబ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

14న ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 14వ తేదీన రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 15న కలెక్టరేట్‌లో యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

సదుమమ్మ ఆలయంలో దసరా పూజలు



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో సదుమమ్మ ఆలయంలో నిర్వహించిన దసరా పూజల్లో శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందించారు. మహిళలు సామూహికంగా పొంగళ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేలను కలిశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి అభినయ్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వల్లివేడు పృథ్వీ రెడ్డి, మనోహర్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, ఇమ్రాన్ పాల్గొన్నారు.



క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


చంద్రశేఖర్ (ఫైల్)

పెద్దపంజాణి: కడుపు నొప్పి భరించలేక చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సహదేవి కథనం మేరకు వివరాలు.. బొమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు చంద్రశేఖర్(45) గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద ఇల్లు కట్టుకుని అక్కడే కటుంబ సభ్యులతో కలసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గత ఆరు నెలలుగా చంద్రశేఖర్ కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. గురువారం సాయంత్రం నొప్పి తీవ్రం కావడంతో సమీపంలోని గ్రామానికి వెళ్లి చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నాడు. అనంతరం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేసి పడుకున్నాడు. వేకువజామున సుమారు 3 గంటల ప్రాంతంలో భర్త కనిపించకపోవడంతో భార్య లక్ష్మీదేవి, భర్త తమ్ముళ్లతో కలసి చుట్టుపక్కల గాలించారు. ఈ క్రమంలో సమీపంలోని మామిడి చెట్టుకు చంద్రశేఖర్ మృతదేహం వేలాడుతూ కనిపించింది. లక్ష్మీదేవి ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ తరహా అపార్



జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా ఆధార్ తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. వన్ నేషన్- వన్ స్టూడెంట్ నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్ కేటాయించనున్నారు. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేస్తారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు ఈ నంబర్ కేటాయించనున్నారు.

జిల్లా కేంద్రంలోని గిరింపేటకు చెందిన రమేష్ తన ఇద్దరు కుమారులను స్థానిక గిరింపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతులు చదివించేవాడు. ఉద్యోగరీత్యా రమేష్ బెంగళూరుకు వెళ్లాల్సి రావడంతో తన కొడుకులను అక్కడ ఓ స్కూల్‌లో చేర్పించేందుకు వెళ్లాడు. అయితే ఆ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్ కావాలంటే గతంలో చదివిన ప్రాంతంలో విద్యాశాఖ అధికారుల నుంచి ప్రత్యేక సిఫార్సు లెటర్ తీసుకొస్తేనే ఇస్తామని తేల్చిచెప్పారు. దీంతో రమేష్ తన పిల్లలను అక్కడ చేర్పించేందుకు చాలా ఇబ్బంది పడ్డాడు. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం అపార్ గుర్తింపు కార్డును విద్యార్థులకు ఇవ్వాలని నిర్ణయించింది. తద్వారా విద్యార్థులు దేశంలో ఎక్కడైనా విద్యనభ్యసించవచ్చు.

- వన్ నేషన్-వన్ స్టూడెంట్ విధానానికి కేంద్రం మొగ్గు
- దేశంలో ఎక్కడైనా చదువుకునే అవకాశం
- ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన కార్డు జారీ
- ఒకసారి కార్డు జారీ అయ్యాక సవరణకు నో చాన్స్
- యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో విద్యార్థుల వివరాలు నిక్షిప్తం
- జిల్లాలో అపార్ నమోదుకు కసరత్తు ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మొదటగా ప్రైమరీ స్కూల్ నుంచి హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ అపార్ నంబర్ కేటాయించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం ప్రత్యేక ఐడీని రూపొందిస్తున్నారు. అలాగే డిజిటలైజేషన్, పర్సనలైజ్డ్ లెర్నింగ్, బడిబయట లేదా చదువుకు దూరంగా ఉన్న విద్యార్థులను తిరిగి స్కూళ్లలో చేర్పించడం ద్వారా విద్యను సార్వత్రికం చేయడం దీని ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ప్రస్తుతం పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్-పెన్) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంతో పాటు టీసీలు జారీ చేస్తున్నారు. ఇకపై అపార్ ఉంటే చిత్తూరు జిల్లా విద్యార్థి బెంగళూరులో, కశ్మీర్ విద్యార్థి చిత్తూరు జిల్లాలో.. ఇలా దేశంలో ఎక్కడికైనా వెళ్లి చదువుకోవచ్చు.



కసరత్తు చేపట్టిన విద్యాశాఖ..

జిల్లాలో 1 నుంచి 12వ తరగతి వరకు ఉన్న 2,46,189 మంది విద్యార్థులకు అపార్ ఐడీని రూపొందించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. తొలివిడతలో విద్యాశాఖ అధికారులు ట్రయల్ రన్‌గా 9, 10 తరగతులకు అపార్ ఐడీని రూపొందించే చర్యలు ప్రారంభించారు. అపార్ ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉంది. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో విద్యార్థికి పెన్(పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్) ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆధార్ చెల్లుబాటు(వ్యాలిడేట్) అయి ఉండేలా చూడాలి. ఈ కొత్త విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. ప్రాథమిక విద్య మొదలు ఇంటర్ వరకు అపార్ ఐడీ జారీ దిశగా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెల 14వ తేదీలోపు ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకుల అనుమతి పత్రాలను తీసుకున్న అనంతరం ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ రూపొందించనున్నారు.

జిల్లా వివరాలు..	
జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు	2,064
ప్రాథమికోన్నత పాఠశాలలు	293
ఉన్నత పాఠశాలలు	527
ఇంటర్మీడియట్ కళాశాలలు	102
1 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు 2,46,189 మంది	

తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి..

విద్యార్థుల అకడమిక్ డేటా భద్రంగా ఉంచేందుకు, గోప్యత పాటించేందుకు అవసరమైన చర్యలు కూడా తీసుకుంటున్నారు. అపార్ ఐడీ వివరాలను అధీకృత వినియోగదారుల ద్వారా మాత్రమే అందుబాటులో ఉండేలా భద్రతా చర్యలను తీసుకుంటారు. 18 ఏళ్లలోపు పిల్లల అపార్ ఐడీ జనరేషన్‌కు తల్లిదండ్రులు లేదా సంరక్షకుల అనుమతితోనే క్రియేట్ చేస్తారు. అపార్ ఐడీ జనరేట్ చేసేందుకు తల్లిదండ్రులు ఇచ్చిన అంగీకార పత్రాన్ని పాఠశాలలో భద్రపరుస్తారు. ఆధార్ నంబర్ ఆధారంగా అపార్ ఐడీని క్రియేట్ చేస్తారు.

ఉపయోగాలు ఇవీ..

అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయి. పేరు, పుట్టిన తేదీ, జెండర్ క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు అన్నీ కలిపి డిజిటల్ కార్డు రూపంలో భద్రపరుస్తారు. విద్యార్థి చదువుకు సంబంధించిన అకాడమీ సమాచారం అంటే ఎన్ని మార్కులు లేదా ఏ గ్రేడ్ వచ్చింది ? ఉపకార వేతన వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలు, వ్యక్తిగత, విద్యా సంబంధిత వివరాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. విద్యార్థికి కేటాయించిన నంబరును ఇంటర్‌నెట్‌లో అన్వేషించడం లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి సమాచారం చిటికెలో వచ్చేస్తుంది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ, ఇంటర్వ్యూ సమయంలో ఇది కీలకం కానుంది. అకాడమీ పరంగా విద్యార్థికి జీవితకాల గుర్తింపుగా పరిగణిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి అపార్ (ఆటోమేటిక్ పర్మనెంట్ అకౌంట్ రిజిస్ట్రీ) చేయించుకోవాలి.

క్షేత్రస్థాయిలో అవగాహన..



అపార్ ఉపయోగాల పట్ల క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతోంది. ఆధార్ నంబర్ మాదిరిగానే ప్రతి విద్యార్థికి అపార్ ఐడీని కేటాయించాల్సింది ఉంది. ఈ విషయమై ఇటీవలే వెబెక్స్ ద్వారా హెచ్‌ఎంకు తెలియజేశాం. తొలుత అపార్ ఐడీపై హెచ్‌ఎంలకు అవగాహన కల్పిస్తాం. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల నుంచి వారి అంగీకార పత్రాలను తీసుకున్న తర్వాత ఐడీలు క్రియేట్ చేసేందుకు చర్యలు చేపడతాం. ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ అందజేసేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. – దేవరాజు, డీఈఓ, చిత్తూరు జిల్లా

ప్రయోజనాలు ఎన్నో..



అపార్ గుర్తింపు కార్డు వల్ల విద్యార్థుల ప్రయోజనాలు ఎన్నో ఉంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే దిశగా విద్యాసంస్థల నిర్వాహకులకు సూచిస్తున్నాం. జాతీయ విద్యావిధానంలో భాగంగా ఆధార్ తరహాలో అపార్ ప్రత్యేక గుర్తింపు కార్డును కేంద్రం అమల్లోకి తీసుకొస్తోంది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన అపార్ నంబర్‌ను కేటాయించనున్నారు. కసరత్తును పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. – చంద్రశేఖర్, డీవైఈఓ, చిత్తూరు

అపార్ కార్డు పొందే విధానం..



అపార్ కార్డు పొందే విద్యార్థితో పాటు తల్లి లేదా తండ్రి కచ్చితంగా విద్యాసంస్థకు వెళ్లాలి. తొలుత యూడైస్ ప్లస్‌లో నమోదైన వివరాలను వారు సరిచూసుకోవాలి. అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దీనికి హెచ్‌ఎం లేదా ప్రిన్సిపల్ ధ్రువీకరణ తప్పనిసరి. విద్యార్థి ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసిన అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో అపార్ కార్డు ఒకసారి వెలువడితే సవరణకు అవకాశం ఉండదు. జిల్లాలో ముందుగా 9, 10 తరగతుల విద్యార్థులకు అపార్ కార్డుల నమోదు చేపట్టారు. అన్ని రకాల యాజమాన్యాల విద్యార్థులకు ఇది అవసరం.

కుప్పకూలిన స్కూల్ పైకప్పు


కూలిపోయిన పాఠశాల పైకప్పు

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం పంచాయతీ శ్రీబొమ్మరాజుపురంలో ప్రాథమిక పాఠశాల పైకప్పు శుక్రవారం కుప్పకూలిపోయింది. పాఠశాలకు సెలవు ఉండడంతో ఏమీ జరగలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ప్రస్తుతం 8 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనంలో పిల్లలకు విద్యను బోధించలేక టీచర్ కూడా స్కూల్ ఆవరణలోనే చదువు చెబుతున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. విషయం తెలుసుకున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్, టీచర్ వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకుని భవనం కూలిపోయిన విషయాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

బాలుడు అదృశ్యం


బిందుసర్

వి.కోట : పట్టణంలోని సాయి గార్డెన్ సిటీలో కాపురం ఉంటున్న రాధాకృష్ణ కుమారుడు బిందుసర్(13) బుధవారం సాయంత్రం నుంచి కనపడడం లేదు. ఈ విషయంపై శుక్రవారం తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాలుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు వి.కోట పోలీసుల నంబర్ 9440900740కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బైక్- మినీ టెంపో ఢీ: ఒకరి మృతి


గంగప్ప గౌడు(ఫైల్)

రామకుప్పం: మండల పరిధిలో శుక్రవారం ఓ బైక్‌ను మినీ టెంపో ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపిన వివరాలు.. మండలంలోని బూరుగుమాకులపల్లికి చెందిన గంగప్ప గౌడు(60), ఎస్.గొల్లపల్లికి చెందిన సోమప్ప బైక్‌లో బూరుగుమాకులపల్లి నుంచి వీ.కోటకు బయలుదేరారు. కృష్ణగిరి నుంచి మదనపల్లెకు వెళ్తున్న మిని టెంపో బూరుగుమాకులపల్లి సమీపంలో వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగప్ప గౌడు అక్కడికక్కడే మృతి చెందగా, సోమప్పకు తీవ్ర గాయాలయ్యాయి. గంగప్ప కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాడిరైతులకు దసరా బోనస్

- వరుసగా నాలుగో ఏడాది చెల్లించిన అమూల్ డెయిరీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

మదనపల్లె : దసరా, దీపావళి సందర్భంగా అమూల్ డెయిరీకి పాలుపోసిన పాడిరైతులకు బోనస్‌గా రూ.3 కోట్లు ఖాతాల్లో జమచేసినట్లు అమూల్ యాజమాన్యం తెలిపింది. శుక్రవారం అమూల్ డెయిరీ విడుదల చేసినఓ ప్రకటనలో.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పాలవెల్లువ పథకంలో భాగంగా వరుసగా నాలుగోసారి పాల ఉత్పత్తిదారులకు బోనస్ చెల్లించినట్లు పేర్కొంది. ఏడాది దసరా, దీపావళి పండుగను పురస్కరించుకుని(అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు) ఏడాదిలో కనీసం 183 రోజులు డెయిరీకి పాలుపోసిన రైతులకు లీటర్‌కు అర్ధరూపాయి బోనస్‌ను వారి ఖాతాల్లో జమచేశామన్నారు. 2021లో 3,610మందికి రూ.25.59 లక్షలు, 2022లో 6,880 మందికి రూ.70.77 లక్షలు, 2023లో 10,455 మంది పాడిరైతులకు రూ.1.27 కోట్లు చెల్లించామని, ప్రస్తుతం 2024 సంవత్సరానికి 18,645 మంది రైతులకు రూ.2.86 కోట్ల రూపాయల బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. జిల్లాల వారీగా తీసుకుంటే..అన్నమయ్య జిల్లాలో 380 గ్రామాల్లో 5,884 పాడిరైతులకు రూ.1.23 కోట్లు, చిత్తూరు జిల్లాలో 297 గ్రామాల్లో 3,355 మంది పాడిరైతులకు రూ.62.93 లక్షలు, వైఎస్సార్ కడప జిల్లాలోని 161 గ్రామాల్లో 4,007 మంది పాడిరైతులకు రూ.34.94 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాలో 119 గ్రామాల్లో 2,103 మంది పాడిరైతులకు రూ.35.44 లక్షలు, తిరుపతి జిల్లాలో 200 గ్రామాల్లో 2,287 మంది పాడిరైతులకు రూ.20.36 లక్షలు, అనంతపురం జిల్లాలోని 98 గ్రామాల్లో 1,009 మంది పాడిరైతులకు రూ.9.79 లక్షలు మొత్తంగా 6 జిల్లాలకు కలిపి 1,258 గ్రామాలకు 18,645 మంది రైతులకు 2 కోట్ల 86 లక్షల 85 వేల 209 రూపాయలను బోనస్‌గా ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ఇతర డెయిరీల కంటే అధిక ధరలను పాడిరైతులకు చెల్లించడమే కాకుండా నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ, వారు ఉత్పత్తి చేసే పాలనాణ్యతకు న్యాయమైన ధర చెల్లిస్తున్నామని తెలిపారు.

సీఎంసీకి మరో వరం

- సీఎంసీలో మెడికల్ కాలేజీ, టీచింగ్ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు
- 120 నుంచి 422 పడకలు పెంచేలా ప్రణాళికలు
- అజీమ్ ఫౌండేషన్ ద్వారా రూ.500 కోట్లు అందనున్న వైనం
- నాడు వైఎస్సార్ చలువే సీఎంసీ ఏర్పాటు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 125వ వార్షికోత్సవంలో భాగంగా సీఎంసీ (క్రిస్టియన్ మెడికల్ కాలేజీ) చిత్తూరులో మరో అడుగు ముందుకేసింది. మెడికల్ కాలేజీ, టీచింగ్ ఆస్పత్రి ఏర్పాటుకు కసరత్తు మొదలు పెట్టింది. ఇందుకు అజీమ్ ఫౌండేషన్ చేయూతనిస్తూ రూ.500 కోట్ల నిధులు ఇవ్వనుంది. తద్వారా 120 పడకల ఆస్పత్రి 422 పడకలతో బోధనాస్పత్రిగా రూపుదిద్దుకోనుంది. దీంతో అన్ని రకాల వైద్యసేవలతో పాటు మెడికల్ విద్యాబోధన కల్పించే దిశగా సంస్థ చూస్తోంది.

నాడు వైఎస్సార్ కృషే సీఎంసీ..

వేలూరు సీఎంసీని చిత్తూరుకు తీసుకొచ్చేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఎంతో కృషి చేశారు. 2009లో గుడిపాల మండలం చీలాపల్లి వద్ద 640 ఎకరాలను సీఎంసీ కోసం కేటాయించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 35 రకాల వైద్యసేవలు అందిస్తున్నారు. సుమారు 600 మంది వివిధ విభాగాల్లో పని చేస్తున్నారు. అందులో 350 మంది చిత్తూరు వాసులే ఉన్నారు. నిత్యం ఓపీలు 1000కి పైగా వస్తున్నాయి. అత్యవసర సేవలకు 60మందికి పైగా వస్తున్నారు. ఈసేవలను మరింత విస్తరించేందుకు గతేడాది మరిన్ని పడకల ఆస్పత్రిని నిర్మించాలని నిర్వాహకులు పూనుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. తర్వాత ప్లాన్‌ను కూడా అప్పట్లోనే ప్రకటించారు. ఆ రకంగా సీఎంసీ సంస్థ నిర్వాహకులు ముందడుగు వేశారు. టీచింగ్ ఆస్పత్రితో పాటు విద్యావ్యవస్థను తీసుకొచ్చేందుకు చేపట్టిన ప్రణాళికలను వేగవంతం చేశారు.

ఈనేపథ్యంలో అజీమ్ ఫౌండేషన్‌ను సంప్రదించగా రూ.500 కోట్లు ఇచ్చేందుకు ఒప్పుకుంది. మూడేళ్లలోపు ఈ పనులను పూర్తి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా తమిళనాడులోని వేలూరు, రాణిపేట తరహాలో ఇక్కడ అన్ని రకాల వైద్య సేవలు అందనున్నాయని సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందనున్నాయి.

దళితులపై టీడీపీ నేతల దాడి

- అధికార బలంతో తిరిగి దళితులపైనే కేసులు నమోదు
- ఆందోళనకు సిద్ధమవుతున్న దళిత సంఘాలు

వి.కోట: ఇంటి ముందు ఉమ్మితే అది తమను చూసే ఉమ్ముతున్నారని టీడీపీ నేత దళితులపై దాడి చేసి, తిరిగి వారిపైనే కేసులు బనాయించిన సంఘటన వి.కోట మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. వి.కోట మండలం మిట్టూరు గ్రామానికి చెందిన దళితుడైన గోపాలప్ప కుటుంబానికి, అదే గ్రామంలోని అగ్ర కులానికి చెందిన వెంకట్రాముడు కుటుంబానికి గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వి.కోట స్టేషన్‌లో కేసు నడుస్తోంది. బుధవారం గోపాలప్ప కుమారుడు వెంకటేష్ తన ఇంటి ముందు పళ్లు తోముకుంటూ ఉమ్మి వేయడంతో అదే సమయానికి అటుగా వచ్చిన టీడీపీ నేత వెంకట్రాముడు తనను చూసి ఉమ్మి వేస్తావా అంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు. కుటుంబ సభ్యులతో కలిసి దళితుల ఇంటి ప్రాంగణంలోకి చొరబడి విచక్షణారహితంగా దాడులు చేశారు. ఈ దాడిలో గోపాలప్ప, అతని కుమారుడు వెంకటేష్ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారు స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొంది, మెరుగైన చికిత్స కోసం కుప్పం పీఈఎస్‌కు వెళ్లారు. అయితే చేయి విరిగి, తలకు తీవ్రంగా గాయం కావడంతో దళితులు ఫిర్యాదు చేయగా పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేశారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో అగ్రవర్ణాల ఫిర్యాదు మేరకు దళితులపైనే హత్యాయత్నం కేసు నమోదు చేశారని బాధితులు వాపోతున్నారు. గతంలో వెంకటేష్ వలంటీర్‌గా పని చేశాడు. ఈ నేపథ్యంలోనే అతనిపై కక్ష కట్టి తరచూ టీడీపీ నేతలు గొడవలు చేస్తూ, కేసులు పెట్టి వేధిస్తున్నట్లు సమాచారం.

చంద్రబాబే చెప్పింటే.. తహసీల్దార్ మాట వింటామా ?


గ్రామస్తుల దెబ్బకు వెనక్కి పారిపోతున్న ఇసుకాసురులు


నదివద్దనే పహారా కాస్తున్న నాగమంగళం గ్రామస్తులు

- పలమనేరులో రెచ్చి పోయిన ఇసుక స్మగర్లు
- ఇసుకను యంత్రాలతో తరలిస్తే లక్ష జరిమానా తప్పదన్న తహసీల్దార్
- అయినా నదిలో ఇసుక తవ్వేందుకు యత్నించిన స్మగర్లు
- అడ్డుకుని తరిమికొట్టిన నాగమంగళం గ్రామస్తులు

పలమనేరు: పలమనేరు సమీపంలోని కౌండిన్యలో ఎవరైనా జేసీబీలు పెట్టి ఇసుకను అక్రమంగా తోడినా, కల్వర్టు ఉన్న చోటు నుంచి 500 మీటర్లు ఎవరైనా ఇసుకను తవ్వినా రూ.లక్ష జరిమానా తప్పదని రెండ్రోజుల కిందట పలమనేరు తహసీల్దార్ ఇన్బనాథన్ ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఇసుకాసురులను హెచ్చరించారు. ఇందుకు ప్రతిగా మరింత రెచ్చిపోయిన టీడీపీకి చెందిన ఇసుకాసురులు శుక్రవారం కౌండిన్య నదిలో హైవేలోని బ్రిడ్జికి ఆనుకుని నదితోపాటు వక్ఫ్ స్థలాలు, అటవీశాఖ భూముల్లో వాహనాలను పెట్టి ఇసుకను అక్రమంగా తరలించారు. దీనిపై ఆగ్రహించిన నాగమంగళం గ్రామస్తులు ఏకమై తహసీల్దార్ చెప్పినా మళ్లీ ఎందుకు ఇసుకను తోడుతున్నారని ప్రశ్నించారు. దీంతో టీడీపీకి చెందిన ఇసుకాసురులు తమకు చంద్రబాబే చెప్పాడని, తహసీల్దార్ చెబితే తాము వినే ప్రసక్తే లేదని ఎదురు తిరిగారు. వారి మాటలకు మరింత ఆగ్రహించిన గ్రామస్తులు వారిని అక్కడి నుంచి తరిమికొట్టారు. ఇకపై ఎవడైనా కౌండిన్య నదిలో గానీ వక్ఫ్ భూముల్లో ఇసుకను తోడేందుకు వస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దీంతో ఇసుకాసురులు అక్కడి నుంచి కాలికి బుద్ధి చెప్పారు. కర్ణాటక ఇసుక వ్యాపారులు సైతం టీడీపీ నేతలకు సంబంధించిన వారి డంపుల వద్దకే వచ్చి ఇసుకను కొంటున్నారంటే పరిస్థితి ఎంత ఘోరంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు.